

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - ఎల్ఎన్‌పేట

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. ఎల్ఎన్‌పేట మండలంలో ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లులను మంగళవారం తనిఖీ చేశారు. మిల్లులో అనధికారికంగా ధాన్యం నిల్వలు ఉండరాదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వద్ద ఇంటర్నెట్‌కు సంబంధించి సాంకేతిక సమస్య ఉంటే వైఫైని వినియోగించుకోవాలని సూచించారు. తనిఖీలో తహశీల్దార్ జె.ఈశ్వరమ్మ, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనధికార కొనుగోలుపై చర్యలు శూన్యం

- బ్యాంకు గ్యారంటీలు సమర్పించకుండానే పలుచోట్ల ధాన్యం కొనుగోలు
- అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న వైనం
- తామే మిల్లుల్లో దాచుకున్నామంటూ రైతులతో చెప్పిస్తున్న మిల్లర్లు
- ఆన్‌లైన్ నమోదుకు అధికారులతో పైరవీలు

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవక ముందే కొంతమంది మిల్లర్లు వందలాది బస్తాలతో మిల్లులను నింపుకున్న వైనం ఇటీవల వెలుగు చూసిన వైనం తెలిసిందే. జిల్లాలో ముందుగా వరి పంట చేతికొచ్చే సారవకోట, జలుమూరు, నరసన్నపేటతో పాటు తాజాగా ఎల్ఎన్‌పేటలోనూ లెక్కా పత్రం లేకుండా ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్నాయి. అక్రమ పద్ధతిలో ధాన్యం కొనుగోలు చేసిన మిల్లర్లు, అధికారుల చర్యల నుంచి బయటపడేందుకు అతి తెలివి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. వర్షానికి తడిచిపోకుండా తామే మిల్లులో ధాన్యం దాచుకున్నట్లు రైతులతో చెప్పిస్తున్నట్లు తెలిసింది. అనధికారికంగా కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వపరంగా చెల్లింపులు చేసే అవకాశం లేకపోవడంతో, ఆ ధాన్యాన్ని ఎలాగైనా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకునేందుకు అధికారులపై ఒత్తిడి చేస్తునట్లు సమాచారం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ఈసారి అనేక సాంకేతిక చిక్కులు ఆటంకపరుస్తున్నాయి. రైతులు ధాన్యం అమ్మేందుకు సిద్ధపడుతున్నా, కొనుగోలు చేయడం లేదు. ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయాన్ని అరికట్టేందుకు తీసుకొచ్చిన కొత్త సాంకేతిక పరిజ్ఞానం సేకరణకు ఇబ్బందిగా పరిణమిస్తోంది. ముఖ్యంగా ధాన్యం మర ఆడించేందుకు మిల్లర్లు ప్రభుత్వానికి ఇచ్చే బ్యాంకు గ్యారంటీ(బిజి)లను ప్రభుత్వం ఈసారి ఈ-బిజిలుగా మార్చింది.



ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు వివరాలను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

దీంతో బ్యాంకుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం పడుతున్నట్లు తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల్లోని జియో కో-ఆర్డినేట్స్‌కూ, జిపిఎస్ (గ్లోబల్ పొజిషన్ సిస్టమ్)కు మ్యాచ్ కాకపోవడం కొనుగోలుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించేందుకు అధికారులు ఒకపక్క ప్రయత్నం చేస్తుంటే, కొంతమంది మిల్లర్లు అనధికారిక కొనుగోలుకు తెర తీశారు. కొనుగోలు కేంద్రాలు, బిల్లులతో సంబంధం లేకుండా వేలాది టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

అధికారులు పసిగట్టలేకపోయారా?

జిల్లాలోని పలు మండలాల్లో అధిక మొత్తంలో అనధికారికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నా, పసిగట్టడం లేకపోవడం అధికారుల అనుభవ రాహిత్యానికి అద్దం పడుతోంది. అధికారులకు ఫిర్యాదులు వచ్చినంత వరకు మేల్కోలేకపోయారు. ధాన్యం సేకరణలో ఈతరహా అక్రమ పద్ధతులను అనుసరించడంలో ఆరితేరిన కొంతమంది మిల్లర్లు అధికారుల కళ్లుగప్పి కొనుగోలు చేసేశారు. తనిఖీలకు వెళ్లిన అధికారులను సైతం తప్పుదోవ పట్టించేందుకు అప్పటికప్పుడే పథకం రచించారు. వర్షాలకు ధాన్యం తడిచిపోకుండా, రైతులు మిల్లుల్లో దాచుకున్నారంటూ కట్టుకథలు అల్లారు. గతంలో మాతల మిల్లులో అనధికారికంగా ధాన్యం నిల్వలను గుర్తించిన సందర్భంలో మిల్లర్లు ఇదే కథ అల్లినా, అప్పటి కలెక్టర్ లక్ష్మీనరసింహ ఆ మిల్లును సీజ్ చేశారు. ప్రస్తుతం అనధికారిక ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారనే చర్చ నడుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు ఉపక్రమించడం లేదా?, మిల్లర్ల పైరవీలతో ముందుకు వెళ్లలేకపోతున్నారా;? అనే చర్చ నడుస్తోంది.

ఉలుకూ పలుకూ లేని అచ్చెన్న

వ్యవసాయశాఖ మంత్రి జిల్లాలోనే అనధికారికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వార్తలు, ఫిర్యాదులు వస్తున్నా మంత్రి అచ్చెన్నాయుడు కనీసం స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లర్లు అలా కొనుగోలు చేయడం తప్పు అని గానీ, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని గానీ ఆదేశించిన దాఖలాలు కనిపించడం లేదు. వ్యవసాయశాఖ మంత్రి మౌనం అనేక సందేహాలకు తావిస్తోంది. కాసులకు కక్కుర్తి పడి ప్రభుత్వానికి తెలియకుండా ధాన్యం కొనుగోలు చేశారంటే, వారు రైతులకు ఏమాత్రం ధర చెల్లించారో చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికైనా మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి తమకు మద్దతు ధర దక్కేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదుకు ఆరాటం

అనధికారికంగా కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వపరంగా ధాన్యం చెల్లింపులు చేపట్టే అవకాశం లేదు. ప్రభుత్వానికి బ్యాంకు గ్యారంటీలు సమర్పించకుండానే ధాన్యం కొనుగోలు చేయడంతో, ప్రభుత్వం ఆ ధాన్యానికి డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో వాటిని ఎలాగైనా ఆన్‌లైన్‌లో నమోదు చేయించేందుకు మిల్లర్లు తెగ ఆరాటపడుతున్నారు. మిల్లర్ల పెద్దతో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారా?, తిరస్కరిస్తారా? అనేది చూడాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

'థర్మల్' ప్రతిపాదనను విరమించుకోవాలి

- కాగితాలు చూపించాలని ఎమ్మెల్యే గిరిజనులను అడగడం సిగ్గుచేటు
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో నిర్మించ తలపెట్టిన థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలోని ఆదివాసీల గ్రామాలకు వెళ్లిన ఎమ్మెల్యే కూన రవికుమార్, ఈ ప్రాంతంలో థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు కాగితాలు ఉంటే చూపించాలని ఆదివాసీలను అడగడం సిగ్గుచేటు అన్నారు. ఆ ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించేది లేదని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం, ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తనకు తెలియదని ఎమ్మెల్యే చెప్పడం కంటే ఈ ప్రాంతంలో నిర్మించడం లేదని చెప్తే బాగుండేదన్నారు. ఏదీ లేకపోతే పెన్షన్లు పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే భారీ పోలీసు బందోబస్తుతో వెళ్లడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే, మొండిగా ఎందుకు ముందుకెళ్తున్నారని ప్రశ్నించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ నుంచి వెన్నెలవలస, మదనాపురం, బొమ్మిక రిజర్వాయర్ వరకు థర్మల్ పవర్ ప్లాంట్ కోసం సుమారు 30 వేల ఎకరాల భూసేకరణకు పరిశీలన చేస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఉద్యమకారులపై అవాకులు చవాకులు పేలుతూ ఉద్యమాన్ని అణచివేసే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలను నమ్ముకోవాలని పోలీసులను కాదన్నారు. థర్మల్ ప్లాంట్ ఈ ప్రాంతంలో పెట్టబోమని ఎమ్మెల్యే స్వయంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ఎ.రవికాంత్, సిపిఎం నాయకులు సవర లక్ష్మణరావు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ కుమార్, థర్మల్ పోరాట కమిటీ సభ్యులు సవర సింహాచలం, కె.మనోజ్, సవర సింగయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన ఐదు నెలల కాలానికి నియామకం చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్లకు నెలకు రూ.12,500, ఎస్‌జిటిలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల మూడు నుంచి ఐదో తేదీ వరకు సంబంధిత మండల ఎంఆర్‌సిలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, మెళియాపుట్టి, పలాస, పాతపట్నం, సోంపేట మండలాల్లో 24 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. 75:25 నిష్పత్తిలో విద్య, వృత్తిపరమైన అర్హత మార్కుల మెరిట్ ఆధారంగా నిర్ణయించి ఎంపిక చేయనున్నట్లు వివరించారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. దరఖాస్తు, పూర్తి వివరాలు sites.google.com/site/deosklorg వెబ్‌సైట్‌లో ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 8500056891 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

'ఆశా'లకు వేతనాలు పెంచాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - రణస్థలం

ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని రావాడ జంక్షన్ వద్ద మంగళవారం నిర్వహించిన ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించాలని, పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు ఆరేళ్లుగా ఒక్క రూపాయి వేతనం పెంచలేదని, డిఎ కూడా అమలు చేయడం లేదని చెప్పారు. వారికి ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని అయినా రకరకాల యాప్‌ల భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 5జి సపోర్టుతో పనిచేసే ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేతనాలు ప్రతి నెల ఒకటో తేదీన చెల్లించాలని కోరారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో పలు రంగాల కార్మికులు, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు ఈ మహాసభలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కాంతమ్మ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యాలయంలో ఈ-ఆఫీసు తప్పనిసరి

- ఫైళ్లను పెండింగ్‌లో పెట్టొద్దు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వచ్చే వారానికల్లా జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఈ-ఆఫీసు వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ప్రభుత్వ విభాగాల వారీగా ఫైళ్ల పరిష్కారంపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైళ్ల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. ఆర్థికాంశాలతో ముడిపడని ఫైళ్లను, మరీ సంక్లిష్టమైన అంశమైతే తప్ప వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ-ఆఫీసు ఫైళ్ల పరిష్కారంలో వెనుకబడిన ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాస మున్సిపాలిటీలు, ఎపిఎస్ఐడిసి, జిల్లా రిజిస్ట్రార్ వంటి శాఖలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి నుంచి డిసెంబరు మొదటి వారం వరకు ఒక్క ఫైలునీ ఈ-ఆఫీస్ ద్వారా పరిష్కరించని వారు వచ్చే సోమవారానికల్లా ప్రగతి కనబరచాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో డయేరియా ఘటనపై కలెక్టర్ మాట్లాడుతూ ఆహారం, నీరు, పారిశుధ్యం విషయంలో జిల్లా మొత్తం ఆయా ప్రభుత్వ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన పెంచడానికి తక్షణమే క్యాంపెయిన్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ ప్రచారం ద్వారా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలి, వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని తెలియజేయాలన్నారు. ఆహార కల్తీ విభాగానికి చెందిన అధికారులు హోటల్స్, సినిమా హాళ్లు, రోడ్డు సైడ్ ఫుడ్‌స్టాల్స్‌కు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. తనిఖీల పేరుతో వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టరాదని స్పష్టం చేశారు. పలు శాఖల ప్రగతి అంశాలపై, ముఖ్యంగా ధాన్యం సేకరణ అంశంలో బ్యాంకు గ్యారంటీలు, వాహనాల రిజిస్ట్రేషన్, టార్పాలిన్ల లభ్యతపై చర్చించారు. తుపాను, అనంతరం వర్షాల కారణంగా ధాన్యం నష్టం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారిశుధ్యం విషయంలో శానిటరీ వర్కర్ల హాజరు, వాహనాల మ్యాపింగ్, చెత్త సంపద కేంద్రాలు షెడ్ల నిర్వహణ, ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ఆస్పత్రుల్లో మందుల పంపిణీ, పారిశుధ్యం, రోగ నిర్ధారణ సేవలను మెరుగుపరచాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రైల్వే ఓవర్ బ్రిడ్జి భూసేకరణ పరిశీలన

ప్రజాశక్తి - ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ సమీపంలోని ఊసవానిపేట రైల్వే గేటు వద్ద ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు చేపట్టిన భూసేకరణ అలైన్మెంట్ సర్వే అంశాలను సమీక్షించారు. తహసీల్దార్ రాంబాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. నివేదికలు అందిన తర్వాత భూములకు నష్టపరిహారం చెల్లింపుపై తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. పరిశీలనలో మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, కూన భానోజీరావు రెవెన్యూ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



రైల్వే బ్రిడ్జి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

తీరంలో ఆలివ్‌రిడ్లే మృత్యువాత

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు



శివసాగర్ తీరంలో ఆలివ్‌రిడ్లే కళేబరాలు

సముద్ర తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఆలివ్‌రిడ్లే తాబేళ్లు సముద్రంలో జీవావరణ సమతుల్యానికి దోహద పడతాయి. వాటి సంతతిని అభివృద్ధి చేసుకునే క్రమంలో కొన్ని వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి సముద్ర తీరానికి చేరుకుని గుడ్లు పెడతాయి. ఈ క్రమంలో బోట్ల పంకాకు, మత్స్యకారులు ట్రాలర్లలో ఉపయోగించే రింగు వలలకు చిక్కిన ఆలివ్‌రిడ్లేలు మృత్యువాత పడుతున్నాయి. అలా మృతి చెందిన కళేబరాలు మండలంలోని అక్కుపల్లి శివసాగర్ సముద్ర తీరానికి కొట్టుకొచ్చాయి. స్థానిక మత్స్యకారుల చేపల వేటతో వీటికి ప్రమాదం లేదు. పెద్ద బోట్లతో బాగా సముద్రం లోపల వేట చేసే వారు ఉపయోగించే వలలతో ఇవి మృతి చెందుతున్నాయి. ఈ సముద్ర తాబేళ్ల రక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణరంగంలో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్మాణరంగం ప్రముఖ పాత్ర పోషిస్తోందని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఆర్.సురేష్ కుమార్ అన్నారు. నిర్మాణరంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను గమనిస్తూ, వాటిపై విద్యార్థులంతా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ టెక్నాలజీ విద్యార్థులకు ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా మంగళవారం ప్రత్యేక అవగాహన కల్పించారు. సాధారణ తరగతులతో పాటు ఆన్ ఫీల్డ్ ప్రాక్టీస్ ఎంతో ఉపయోగకరమని జిల్లా కమిటీ సభ్యులు దుగ్గివలస రాంప్రసాద్, ఎం.ఎ.ఎస్ శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు దత్తాత్రేయ ఆలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న రాజేష్ టవర్స్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అధ్యాపకులు ఎం.ఆర్.కె శ్రీనివాస్, భార్గవ్ కుమార్ తెలిపారు. రాడ్ బెండింగ్, పిల్లర్ల నిర్మాణం, పలు దశల్లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. డిసెంబరు 31వ తేదీ వరకు జిల్లాలో ఒజిటి కార్యక్రమం జరుగుతోందనీ, నాలుగు ప్రాంతీయ కమిటీలు జిల్లావ్యాప్తంగా పర్యవేక్షణ చేస్తున్నాయని తెలిపారు. జిల్లా కన్వీనర్‌గా సీనియర్ ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్ వ్యవహరిస్తున్నారని చెప్పారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి



ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మండలంలోని దండు గోపాలపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ధాన్యం సేకరణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మనోహర్ ప్రసాద్, ఆర్‌డిఒ కృష్ణమూర్తి, టెక్కలి ఎడిఎ కె.జగన్మోహనరావు, సంతబొమ్మాళి వ్యవసాయ అధికారి అప్పారావు, డిటి రామచంద్ర, విఎఎ ఎస్.యమున, టిడిపి నాయకులు వసంతరావు, పంగ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేయండి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

డయేరియా ప్రబలిన తాళ్లవలస గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని తాళ్లవలసలో డయేరియా బాధిత కుటుంబాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, వైద్యారోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా తదితర విభాగాల అధికారులతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డయేరియాకు గల అసలు కారణాలు తక్షణమే గుర్తించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తాగునీటి నమూనాలను విశాఖలోని ప్రయోగశాలకు పంపించి శాస్త్రీయంగా పరీక్షించాలని సూచించారు. ప్రతి కుటుంబానికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబం సురక్షితంగా ఉండేలా అన్ని విభాగాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నాయని భరోసానిచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. డయేరియాతో వృద్ధుని మృతిపై కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత, టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, వైద్యారోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా అధికారులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



విద్యార్థుల అభ్యసనను పరిశీలిస్తున్న దేవానందరెడ్డి

కెజిబివిల్లో శతశాతం ఉత్తీర్ణతకు ప్రణాళికలు

ప్రజాశక్తి - పొందూరు

కెజిబివిల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలను కచ్చితంగా అమలు చేయాలని కెజిబివిల రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి అన్నారు. మండలంలోని లోలుగు కెజిబివి పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయపథం లక్ష్యాల సాధనకు ప్రతిఒక్కరూ శ్రమించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా కెజిబివిలు ఫలితాలను సాధించాలని తెలిపారు. ఏడో తరగతి విద్యార్థులకు కొన్ని పదాలను చెప్పి వాటిని రాయమని సూచించి వాటిని పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులకూ 15 మార్కులకు స్లిప్ టెస్టును నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సమగ్రశిక్ష ఎపిసి పి.వేణుగోపాలరావు, జిసిడిఒ సిహెచ్.మాధవి, ప్రిన్సిపాల్ లలితకుమారి తదితరులు ఉన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కవిటి

యుటిఎఫ్ మండల శాఖ మహాసభ, నూతన కమిటీ ఎన్నికలు మంగళవారం కవిటి ప్రాథమిక పాఠశాలలో ఉత్సాహపూరితంగా నిర్వహించారు. సమావేశానికి జి.జానకిరావు అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు కొర్రాయి రామారావు, జుత్తిక రౌలో, మామిడి శ్రీను తదితరులు పాల్గొని మహాసభను విజయవంతం చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్ ఎన్నికల అధికారిగా పర్యవేక్షించగా, జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు ఎన్నికల పరిశీలకులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిటి యుటిఎఫ్ మండల కమిటీని ప్రకటించారు. గౌరవాధ్యక్షునిగా మామిడి శ్రీను, అధ్యక్షునిగా నారద కామేశ్, ప్రధాన కార్యదర్శిగా బి.సూర్యం, సహాధ్యక్షులుగా ఎ.వి.రమణ, ఎస్.సుజాత, కోశాధికారిగా ఎస్.శ్రీధర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని యుటిఎఫ్ నాయకులు సూచించారు.


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

చదువుతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి- నందిగాం

తరగతి గదిలో విద్యాబోధనతో పాటు మానసిక ఆనందానికి క్రీడలు దోహదపడతాయని టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్ అన్నారు. 76వ నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను మండలంలోని లభరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బిలుకు కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులతో నిర్వహించిన మార్చ్ ఫాస్టు కన్నుల పండగగా నిర్వహించారు. అనంతరం వివిధ పతకాలను ఆవిష్కరించారు. క్రీడాకారులు పరిచయం చేసుకున్నారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల పరిధిలోని 60 పాఠశాలల నుంచి సుమారు 650 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణయ్య తెలిపారు. నాలుగు మండలాల నుంచి వందలాది మంది క్రీడాకారులు హాజరు కావడంతో మైదానంలో సందడి వాతావరణం చోటుచేసుకుంది. కార్యక్రమంలో ఎంఇఒలు సింహాచలం, అన్నుపురం చిన్నారావు, సర్పంచ్ బొంగి ఆమ్ములమ్మ, మోహనరావు, మాజీ సర్పంచ్ మాదిన లోకనాథం, జిల్లా క్రీడా కార్యదర్శి ఎం.వి.రమణ, నియోజకవర్గ క్రీడా ఇన్‌ఛార్జి నాగళ్ల రమేష్, జోనల్ ఇన్‌ఛార్జి కుప్పిలి ప్రకాష్, మండల ఇన్‌ఛార్జి గజలాపు శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు యాగాటి త్రినాథరావు, జనార్ధన్, కె.కె.రామరెడ్డి, బసవరాజు, శ్యామలరావు, లక్ష్మణరాజా, వాసు, తిరుపతి పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ఈ నెల 31 నుంచి విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ పనస రమేష్, ఆశావర్కర్ల యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.జ్యోత్స్న, ఎస్.గౌరమ్మ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్.ధనలక్ష్మి, ఎస్.లక్ష్మి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మికవర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించేందుకు ఈ మహాసభలు దోహదపడతాయన్నారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలను పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకు సేవచేయమని అధికారం ఇస్తే పెట్టుబడిదారులకు సేవచేస్తుందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, విఒఎ, విఆర్ఎ, ఉపాధి మామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, స్కీం వర్కర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించాలన్నారు. ఆటో, రిక్షా, కళాసీ, పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు గొల్లపల్లి జనార్ధన్, కె.వెంకటమ్మ, శ్రీలత, పద్మ, రమేష్, ఆనంద్, సల్ల రాజు, శంకర్, నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు


సిద్ధమైన బాపూజీ కళామందిర్

5 నుంచి నాటిక పోటీలు

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యాన ఈ నెల 5 నుంచి 7 వరకు ఉదయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు బాపూజీ కళామందిర్‌లో ప్రారంభమవుతాయి. సుమారు 30 ఏళ్ల నుంచి బాపూజీ కళామందిర్‌లో ఎన్నో విశిష్ట, విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తూ, పేద కళాకారులకు పింఛన్లు అందజేస్తూ, సేవా సాహిత్య సంస్థగా అవతరించింది. ఈ సంస్థ 1999 సంవత్సరం నవంబరు నెలలో ప్రారంభమైంది. ఎల్.రామలింగస్వామి, చిట్టి వెంకటరావు, భార్గవప్రసాద్, పన్నాల నరసింహమూర్తి ఆధ్వర్యాన పది మందితో ప్రారంభించారు. ప్రస్తుతం 50 మందితో దినదినాభివృద్ధి చెందింది. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినెలా మొదటి శనివారం క్రమం తప్పకుండా వివిధ రకాల కళారూపాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంది. ప్రతినెలా సుమారు 30 మంది పేద, వృద్ధకళాకారులకు రూ.400 ఆర్థిక సాయం చేస్తుంది. ఏటా రథసప్తమిలో అత్యద్భుత పౌరాణిక కళాకారులతో పౌరాణిక నాటక ప్రదర్శనలు చేస్తుంది. అదేవిధంగా జిల్లాస్థాయిలో జరిగే ప్రభుత్వ, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా నంది నాటకోత్సవాలు ప్రదర్శించే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజుల పాటు రాత్రి 7 నుంచి 9 వరకు నాటిక పోటీల ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎఐసిసి ఒబిసి జాతీయ కో-ఆర్డినేటర్‌గా జీవితేశ్వరరావు



పలాస : అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ఒబిసి విభాగపు జాతీయ కో-ఆర్డినేటర్‌గా కాశీబుగ్గకు చెందిన శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ జీవితేశ్వరరావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఒబిసి చైర్మన్ అనిల్ జైహింద్, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసి వేణుగోపాల్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సిఫార్సుల మేరకే నియామకం చేపట్టినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం అధిష్టానం కల్పిస్తారనడానికి తన నియామకమే ఉదాహరణ అని పేర్కొన్నారు.

మూడు నెలల పింఛను అందజేత

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లికి చెందిన వృద్ధురాలు దుప్పల లక్ష్మీనరసమ్మ అనారోగ్యంతో విశాఖపట్నంలో ఉండేది. ఆమెకు టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు మంగళవారం మూడు నెలల వితంతు పింఛను మంగళవారం అందజేశారు. అనారోగ్యంతో ఆమె విశాఖపట్నంలో కుమారుడు వద్ద ఉంటుంది. మూడు నెలలుగా పింఛనను తీసుకోవడానికి రాలేకపోవడంతో అందోళనతో ఎనర్జీ అసిస్టెంట్ అసిరినాయుడుతో కలిసి వెళ్లి రూ.12 వేలును అందజేశారు. విశాఖపట్నం వచ్చి మూడు నెలలు పింఛనును అందజేయడంపై వృద్ధురాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈయనతో పాటు గ్రామానికి చెందిన నీటి సంఘం ప్రెసిడెంట్ గురుగుబెల్లి రామారావు, మాజీ ఉపసర్పంచ్ అన్నెపు భాస్కరరావు, నాయకులు సీపాన వెంకటరమణారావు ఉన్నారు.


పింఛను అందజేస్తున్న శ్రీరంగనాయకుడు

డిప్యూటీ ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- పలాస

మండల గ్రామ సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒగా ఎస్.ఉమాపతి మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈయన టెక్కలి డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ... ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు సచివాలయ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శులు సద్గుణబాబు, సుధాకర్, రవి, ఖగేశ్వరరావు, మీనాక్షి, ఆశ పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక మండల పరిషత్ లో సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒగా హెచ్.ఉమాపతి బాధ్యతలు చేపట్టారు. ఈయన పార్వతీపురం మన్యం నుంచి ఇక్కడకు ఉద్యోగోన్నతిపై వచ్చారు.


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

బిఎస్‌జెఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి బిఎస్‌జెఆర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కోత శ్రీనివాసరావు మంగళవారం విజేతలను అభినందించారు. నెల 28 నుంచి 30 వరకు అనంతపురం జిల్లా చిగిచెర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొని 44 కిలోల విభాగంలో కిల్లికావ్య తృతీయ స్థానం సంపాదించుకుని బ్రాంజ్ మెడల్ సాధించిందని తెలిపారు. అదేవిధంగా కర్నూలు జిల్లా ఎమ్మిగన్నూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి గట్కా పోటీల్లో పాల్గొన్న పడాల అభిషేక్ బంగారు పతకాన్ని సాధించి ప్రథమస్థానంలో నిలిచారని తెలిపారు. క్రీడాకారులను తయారు చేసిన కోచ్ పాండవుల జగదీష్‌ని, వీరిద్దరిని కరస్పాండెంట్ కోత మురళిధర్‌తో పాటు ప్రిన్సిపాల్ కోత శ్రీనివాసరావు, అధ్యాపకులు బ్రహ్మానందం, అప్పన్న సోమేశ్వరరావు, నారాయణ, ఖగేశ్వరరావు అభినందించారు.

రేపు ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ న్యాయ విభాగంలో మిగులు సీట్లకు తక్షణ ప్రవేశాల్లో భాగంగా ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలను పరిశీలిస్తామని రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాదలిచిన వారు తప్పనిసరిగా లాసెట్- 2025 అర్హత సాధించి ఉండాలన్నారు. గత రెండు కౌన్సెలింగ్‌ల్లోనూ ఇతర లా కాలేజీల్లో చేరి ఉండరాదని తెలియజేశారు. ఈ పరిశీలనకు హాజరయ్యే వారు పది, ఇంటర్, డిగ్రీ, టిసి, స్టడీ, నివాస ధ్రువీకరణతో పాటు లాసెట్ ర్యాంకు కార్డు, హాల్ టిక్కెట్ తీసుకొని నేరుగా యూనివర్సిటీకు రావచ్చునని రిజిస్ట్రార్ సూచించారు. యూనివర్సిటీ లా విభాగంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్, విభాగాధిపతి ఆధ్వర్యాన చేపడతామని తెలిపారు. సీట్లు పొందిన వారికి వర్సిటీ నుంచి సమాచారం తెలియపరుస్తామని తెలిపారు.


నగదు అందిస్తున్న స్పందన సభ్యులు

సమస్య విన్నారు.. స్పందించారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

వేట సమయంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వంక చంద్రరావుకు ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన స్పందన (చలించే హృదయం) అండగా నిలిచింది. చంద్రరావు దీన స్థితి వివరిస్తూ 'జీవిత పోరాటంలో కాలిన ఆశలు' అంటూ నవంబరు 19న 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన సంస్థ సభ్యులు కపాసుకుద్దికు చేరుకుని చంద్రరావు పిల్లలతో మాట్లాడారు. తక్షణ సాయంగా సంస్థ ద్వారా రూ.7,500, కరిగి చక్రవర్తి రూ.1500లు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

సాంకేతికతతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- నరసన్నపేట

సాంకేతికతతో ఉజ్వల భవిష్యత్ ఉందని పద్మావతి కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ అన్నారు. పద్మావతి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా కంప్యూటర్ లిటరసీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు అత్యున్నత ఉద్యోగావకాశాలను పొందగలరని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పౌరుడికీ డిజిటల్ ప్రపంచంలో సమాన అవకాశాలు కల్పించి, వారిని ఆధునిక యుగానికి సన్నద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ అధ్యాపకులు జి.అశ్విని, జి.జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చంద్రరావు

డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని బాణాపురంలో డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ పెద్దింటి చంద్రరావు మంగళవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో చేపట్టిన ఈ పనులు పూర్తయితే గ్రామంలోని మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. డ్రైనేజీ లైన్లతో పాటు రోడ్డు దుర్వస్థతలు కూడా దశలవారీగా సరిదిద్దనున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'కార్గో' ప్రతిపాదనను విరమించుకోవాలి

మందస: మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లోని రైతులు సెంటు భూమి కాదు కదా... జీడి ఆకు, కొబ్బరి రేకు కూడా ఇవ్వమని చాలా స్పష్టంగా మీ ముందే చెప్పామని ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఆర్‌డిఒ, కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేకాధిరి పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేసి ముందుకు వెళ్తామని పత్రిక ముఖంగా ప్రకటించడం హాస్యస్పదంగా ఉందని అన్నారు. రాంపురం, బిడిమి, గంగువాడ, అనకాపల్లి, సంతోష్ నగర్ అనేక గ్రామాల్లో రైతులు యావన్మంది తమ భూములు కార్గో ఏర్పాటుకు ఇచ్చేదే లేదని చెప్పి స్పష్టం చేశారని అన్నారు. పోలీసు నిర్బంధాలు పెట్టి అధికారులు పర్యటించినప్పుడూ రైతులందరూ చెప్పారని అన్నారు. అందుకు ఆ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

రేపట్నుంచి పాటల పోటీలు

సోంపేట : మండలంలోని పలాసపురంలో ఈ నెల 4 నుంచి జిల్లా స్థాయి పాడుతా తీయగా పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. దత్తాత్రేయస్వామి 71వ జయంత్యుత్సవాల సందర్భంగా మూడు రోజుల వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.9,116, ద్వితీయ బహుమతి రూ.7,116, తృతీయ బహుమతి రూ.5,116తో పాటు షీల్డ్ అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9133731962, 9493578025 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళా చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సిఐ మంగరాజు

కంచిలి : మండలంలోని కర్తలిలో మంగళవారం రాత్రి సోంపేట సిఐ మంగరాజు సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు, మహిళలపై వేధింపులు అధికం అవుతున్నాయని అన్నారు. వాటి నుంచి రక్షణ పొందేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నారిశక్తి యాప్ వినియోగం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కంచిలి ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 20 ద్విచక్ర వాహనాలకు ఈ నెల 3న మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు మేరకు ఈ సీజ్ వాహనాలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. అసక్తి ఉన్న వ్యక్తులు ఎక్సైజ్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

తప్పుడు ఆరోపణలు తగవు

టెక్కలి : మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించిన ప్రధానోపాధ్యాయులు పూజారి హరిప్రసన్నపై సర్పంచ్, కమిటీ చైర్మన్లు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని డిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, జిల్లా కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో ఖండించారు. చెట్ల అమ్మకానికి, పదో తరగతి విద్యార్థుల నుంచి రూ.500 చొప్పున వసూలు చేసిన విషయం, ప్రజా సొమ్మును తన ఖాతాకి వాడుకున్న ఉపాధ్యాయుల అక్రమాలపై ఎటువంటి సంబంధం లేదని అన్నారు. ఆరు నెలల క్రితం బదిలీపై హరిప్రసన్నపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు


ఎంపికైన మౌనిక, జ్యోత్స్న

పొందూరు: మండలంలోని రాపాక పంచాయితీ వావిలపల్లిపేటకు వద్ద గల ఎపి మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు ఎ.మౌనిక, ఆర్.జ్యోత్స్నలు రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ మంగళవారం తెలిపారు. జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీలలో మౌనిక క్విజ్ కాంపిటేషన్‌లోను, జ్యోత్స్న పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభను కనబరచడంతో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఈ పోటీల్లో బోటనీ ఉపాధ్యాయులు జి.జీవన్‌బాబు విద్యార్థినులకు గైడ్‌గా వ్యవహరించారని తెలిపారు. గత మూడేళ్లుగా ఈ కౌశల్ క్విజ్ పోటీలకు పొందూరు మోడల్ స్కూల్ విద్యార్థులే ఎంపిక అవుతున్నారని అన్నారు. వీరు ఎంపికపై ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వెంకటరావుకు నివాళి

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో టిడిపి కార్యకర్త త్రిపురాన వెంకటరావు సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకటరావు ఓ కార్యకర్తలే కాకుండా ప్రతి ఒక్క రాజకీయ నాయకుడితో మమేకమై వ్యక్తి అని అన్నారు. వెంకటరావు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమేష్

కల్తీ మద్యంపై బహిరంగ చర్చకు సిద్ధమా?

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాకు చెందిన కొంతమంది టిడిపి నాయకుల డైరెక్షన్లోనే వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని టిడిపి నాయకులు మండిపడ్డారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి రాష్ట్ర నాయకులు మొదలవలస రమేష్ మాట్లాడుతూ ఇటీవల వైసిపి నాయకుడు చింతాడ రవి చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. ఇటీవల సరుబుజ్జిలి పిఆర్ వైన్ షాపులో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులు డబ్బులకు ఆశపడి మద్యంలో నీళ్ల కలిపితే జిల్లా ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు ఆ ఇద్దరి వ్యక్తులతో పాటు షాపు యజమానిపైనా కేసు నమోదు చేశారని అన్నారు. ఇదే కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. రూ.కోట్ల నిధులతో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యేపై వ్యక్తిగత విద్వేష, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అటువంటివి మానుకోవాలని హితవుపలికారు. టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు మాట్లాడుతూ చింతా రవి జిల్లాలోని కొంతమంది టిడిపి నాయకులను రాత్రివేళ కలిసి ఎమ్మెల్యేపై విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదలో మురళి, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, టిడిపి మహిళా నాయకురాలు కణితి విజయలక్ష్మి భాయ్ కొత్తకోట అమ్మినాయుడు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలపై అవగాహన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

కింజరపు ఎర్రన్నాయుడు అగ్రికల్చర్, సైన్సెస్ కళాశాల, ఎస్.ఎస్.పురం పాఠశాలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సిబ్బంది మంగళవారం సందర్శించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.నారంనాయుడు సూచనతో విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన, విపత్తులు నిర్వహణ కల్పించాలని లక్ష్యంతో 70 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను సందర్శించారు. ఇన్‌ఛార్జిలతో మాట్లాడి సేవా కార్యక్రమాలు అమలు తీరును ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ కళాశాల దశ నుంచే విద్యార్థులకు సేవాకార్యక్రమాలు అవగాహన కల్పించడం, భాగస్వామి చేయడం, వ్యవసాయ వ్యవసాయత రంగాల్లోనూ రైతులకు జీవితం ఇవ్వడానికి, వారికి అవసరమైన సేవా కార్యక్రమాలు రూపొందించడానికి ఒక అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ఎస్.చందన్, బి.రమేష్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, జి.రమణ, బి.చిన్మయ్‌రావు, ఎ.నర్సింగరావు, గుణాకరరావు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది


పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ (ఇన్‌సెట్‌లో పార్వతమ్మ ఫైల్)

మురపాకలో కలకలం

ప్రజాశక్తి- లావేరు

గ్రామంలో పంపిణీ చేసిన పింఛను తీసుకుంది.. కుటుంబ సభ్యులతో అప్పటి వరకు సరదాగా గడిపింది ఆ వృద్ధురాలు వడ్డీ పార్వతమ్మ (65). ఎప్పటి మాదిరిగానే పశువులు దాణా తీసుకుని ఆవులు మేపేందుకు గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న తమ కళ్లానికి సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటలు అవుతున్నా ఆవులు మేతకు తీసుకుని రాలేదు. తనతో పాటు ఆవులు మేపుతున్న మరో వృద్ధురాలు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించింది. కళ్లం దగ్గరకు చేరుకున్న కుమారుడు సమీపంలో ఉన్న తోటలు, తదితర చోట్ల వెతికినా కనిపించలేదు. ఈ ఘటన లావేరు మండలం మురపాకలో చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం 100కు డయల్ చేసి తన తల్లి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వృద్ధురాలు ఆచూకీ లభించలేదు. వృద్ధురాలు మేడలో 2.1/2 తులాలు బంగారం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కల్లాం దగ్గరలో విరిగిన గాజులు, చెప్పులు, రక్తపు మరకలు ఘటన స్థలంలో ఉన్నాయి. సమాచారం తెలుసుకున్న లావేరు, రణస్థలం ఎస్ఐలు కె.అప్పలసూరి, ఎస్.చిరంజీవిలు ఘటన స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. వృద్ధురాలు ఆచూకీ లభించకపోవడంతో ఘటన స్థలంలో రక్తపుమరకలు, గాజులు, చెప్పులు ఉండటంతో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలంలో లభించిన శ్యాంపిల్స్‌ను సేకరించారు. వృద్ధురాలకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు లక్ష్మణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వృద్ధురాలు అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్ఐ అప్పలసూరి తెలిపారు.

హత్యగా అనుమానం

పార్వతమ్మ మేడలో ఉన్న బంగారం కాజేయడానికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల కావస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. గ్రామంలో వృద్ధురాలు కనిపించకపోవడంతో భయాందోళన చెందుతున్నారు.

33 మందికి జరిమానాలు

శ్రీకాకుళం సిటీ: రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత కోసమే మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్), బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై జిల్లా పోలీసుల కఠిన చర్యలు కొనసాగుతున్నాయని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం కాశీబుగ్గ, టెక్కలి, మెళియాపుట్టి స్టేషన్ పరిధిలో పట్టుబడిన 33 మంది నిందితులపై సంబంధిత కోర్టులు జరిమానాలు విధించాయన్నారు. కాశీబుగ్గ పలాసలో పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు వాహన చోదకులను కాశీబుగ్గ పోలీసు వారు కోర్టులో హాజరుపరచగా కోర్టు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించిందని అన్నారు. టెక్కలి పోలీసుస్టేషన్ పరిధిలో మూడు కేసుల్లో ముగ్గురికి రూ.పది వేలు చొప్పున జరిమానా కోర్టు విధించినట్లు చెప్పారు. మెళియాపుట్టి స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన శ్రీరామ్ సంతోష్, సవర భీమారావు అనే ఇద్దరు నిందితులకు టెక్కలి కోర్టు రూ.పది వేలు చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు. అదేవిధంగా మెళియాపుట్టి పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఏడుగురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపే వారి వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఇటువంటి కేసుల్లో జరిమానాలు మాత్రమే కాకుండా, తరచుగా పట్టుబడిన వారికి జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

బూర్జలో భారీ చోరీ

బూర్జ: మండల కేంద్రమైన బూర్జలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. దీంతో ఒక్కసారిగా మండలంలోని కలకలం రేపింది. అడపాదడపా చిన్న దొంగతనాలు మండలంలోని గ్రామాల్లో చోటు చేసుకున్నా... సోమవారం అర్ధరాత్రి జరిగిన భారీ చోరీ మండల ప్రజలకు భయాందోళనకు గురిచేస్తుంది. గత 40 ఏళ్లుగా బూర్జలోని నివాసం ఉంటూ చిన్నారు రమేష్ టిఫిన్ షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు, అతను తన కుటుంబంతో కలిసి శనివారం అరుకు వెళ్లారు. పనులు ముగించుకుని సోమవారం రాత్రి సుమారు 11 గంటలకు శ్రీకాకుళం చేరుకున్నారు. రాత్రి ఆలస్యమైందని కారణంగా శ్రీకాకుళంలో ఉంటున్న తన బంధువులు ఇంటి వెళ్లారు. మంగళశారం ఉదయం తన టిఫిన్ షాప్‌లో పనిచేస్తున్న సూర్యనారాయణ అనే వ్యక్తి ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. ఆ విషయాన్ని పక్కింటి వారితో రమేష్‌కు సమాచారం అందజేశారు. రమేష్ హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా, దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. వెంటనే పోలీసులకు తను బీరువాలు దాచుకున్న 6 1/4 తులాల బంగారం, 23 తులాల వెండి, రూ.లక్ష నగదు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రవళ్లిక పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి పరిశీలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పరిశీలిస్తున్న క్లూస్ టీమ్



పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే శంకర్ పర్యటన

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ముంపు సమస్య లేకుండా పటిష్ట చర్యలు చేపట్టి వాటి నివారణే ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ బి కాలనీ, పరిసర ప్రాంతాల్లోని అనుబంధ కాలనీలు, ప్రధానంగా నిత్యం ముంపునకు గురవుతున్న రోడ్లను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని, సమగ్రంగా అధ్యయనం చేసి అవసరమైన మేరకు ముంపు సమస్యను శాశ్వతంగా నివారించేందుకు కాలువలు, రోడ్లు, నిర్మాణాలను త్వరలో చేపడతానని అన్నారు. వాటికి అవసరమైన అంచనాలను తయారు చేసి, టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పంచిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

నైపుణ్యంపై శిక్షణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ట్రిపుల్ ఐటి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పారిశ్రామికవేత్తల నైపుణ్య శిక్షణ కార్యక్రమం స్థానిక శివాని ఇంజినీరింగ్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు ఇన్‌ఛార్జి జి.అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గౌరవాధ్యక్షులుగా పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మాస్టర్ ట్రైనర్ అనిల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యం కూడా అత్యంత ప్రధానమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాన్ని సాధించేందుకు భాగంగా ఈ ప్రత్యేక ఎంటర్‌ప్రైజ్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులు ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి యువకుడూ ఒక చిన్న పరిశ్రమను ప్రారంభిస్తే తామేకాక మరికొందరికి ఉపాధి కల్పించగలరన్నారు. కార్యక్రమంలో వెంకటేష్ నాయుడు, కె.రాజు, ఏలియో పాల్గొన్నారు.



సన్మానిస్తున్న కృష్ణదాస్

సూర్యనారాయణకు సన్మానం

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని గోపాలపెంటలో గదిలి వెంకట సూర్యనారాయణ డాక్టరేట్ డిగ్రీ తీసుకున్న సందర్భంగా మంగళవారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సభ ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బోది ఈశ్వరరావు, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల శేఖరరావు, సర్పంచ్ ఎండ కృష్ణవేణి, ఎంపిటిసి గదిలి మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ తోట అప్పారావు, గ్రామ అధ్యక్షులు గదిలి రమేష్, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి కనపల అరవింద్, మండల యూత్ ఉపాధ్యక్షులు తోట భార్గవ్, తోట అచ్యుత, సబ్బ రాము, సనపల రమేష్, గదిలి ప్రసాద్, గదిలి అప్పలరాజు, ఈగల రాజారావు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

గ్రిగ్స్ పోటీల్లో విజేతలు వీరే

బూర్జ: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన మండల స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీల్లో విద్యార్థులు విజేతలుగా నిలిచారు. మండలంలోని కాటువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలుర విభాగంలో వాలీబాల్, సెటిల్ బ్యాట్మింటన్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. అలాగే బాలికల విభాగంలోనూ వాలీబాల్ సెటిల్ బ్యాట్మెంట్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.దీపక్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు ప్రజలు చూపి ప్రథమ విద్యస్థానంలో నిలిచిన విద్యార్థులను పిడీ నారాయణరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



అభినందిస్తున్న విజయ

క్రీడాకారులకు అభినందనలు

నరసన్నపేట: నరసన్నపేట మండలంలో జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈశ్వరమ్మ ఛారిటబుల్ ట్రస్టు విజయ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఛాంపియన్ షిప్‌లో 15 విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెలలో పంజాబ్‌లో నిర్వహిస్తున్న క్రీడలకు హాజరవుతారని తెలిపారు. వీరికి అన్ని విధాలా ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎం.విజయ్, వూన్న రంగనాథ్, రమణ సాహు, ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి, బొమ్మాళి ఖగేష్, సూరపు సురేష్ పాల్గొన్నారు.

విస్తరించనున్న కృత్రిమ మేధ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భవిష్యత్‌లో కృత్రిమ మేధ అన్ని రంగాల్లో విస్తరించనుందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కత్రిమ మేధస్సు, సాధనాలు, వాటి అనువర్తనాలపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు సాంకేతికతలను విద్యార్థులకు చేరువ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. 'కత్రిమ మేధస్సు ఇక భవిష్యత్ కాదు, ఇప్పటికే మన మధ్య ఉన్న వాస్తవంగా చెప్పారు. ఈ వర్క్‌షాప్ ద్వారా ఆ వాస్తవాన్ని మరింతగా అర్థం చేసుకుని, మన జ్ఞానాన్ని తదుపరి స్థాయికి తీసుకువెళ్లేందుకు ఇది ఒక మంచి వేదిక' అని వివరించారు. టెక్కలి ఐతమ్ కళాశాల డేటా సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.స్వరూప పాల్గొని విద్యార్థులకు వివిధ ఎఐ సాధనాల ఉపయోగం, విద్య, పరిశోధన, కంటెంట్ తయారీ, డేటా విశ్లేషణ, ప్రెజెంటేషన్ రూపకల్పన, ప్రోగ్రామింగ్ సహాయం వంటి అనువర్తనాలపై ప్రత్యక్ష డెమోలు చూపించారు. విద్యార్థులకు అవగాహన అవసరంగా చెప్పారు. విద్యార్థులకు మారుతున్న సాంకేతిక ప్రగతిపై అవగాహన,



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

పట్టు అవసరంగా తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నుంచి 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఈ శిక్షణ తమకు నూతన సాంకేతిక జ్ఞానాన్ని అందించినట్లు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో-ఆర్డినేటర్ మౌనిక, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, డాక్టర్ ఎస్.వాణికుమారి, ఐ.శ్రీలక్ష్మి, ఎస్.మాధవీలత పాల్గొన్నారు.



సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

'టిడిపికి రుణపడి ఉన్నా'

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జీవితాంతం టిడిపికి రుణపడి ఉంటానని కళింగ కోమటి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టెక్కలికి చెందిన దుంప గోవిందరావు అన్నారు. నూతనంగా ఎన్నికైన కళింగ కమిటీ కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు ఆధ్వర్యాన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోవిందరావుకు మంత్రి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అంతకుముందు శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి, టెక్కలి మండలాలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

సంతబొమ్మాళి : కోటబొమ్మాళి ఎన్‌టిఆర్ భవనంలో సిఎం సహాయనిధి చెక్కును వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మరువాడ పంచాయతీ డి.మరువాడకు చెందిన సావుకారి కళావతమ్మకు రూ.1,73,000 విలువైన చెక్కును మంత్రి స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసరాజు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు గంట లోకేష్ పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న వాలంటీర్లు

గోవిందపురంలో శ్రమదానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవ పథకంలో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. గోవిందపురంలో మంగళవారం పుచ్చ వీధి, గొల్ల వీధి, పాఠశాల ఆవరణ, బజారు వీధి, సాయిరాం వీధుల్లో పిచ్చి మొక్కలు, మురుగు నీరు తొలగించి బ్లీచింగ్ చల్లారు. అనంతరం తెలుగు అధ్యాపకులు కేశవరావు వాలంటీర్లకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రూపసుందర్, అధ్యాపకులు ఝాన్సీ, రాంబాబు, శోభ, భాగ్యవతి, ఆలేఖ్య, సౌజన్య, వాణి, రమణ, పున్నయ్య పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న సభ్యులు

అదే ఆదరణ

ప్రజాశక్తి- కవిటి

ఆపదలో ఉన్న అభాగ్యులపై స్థానిక ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఎప్పటిలాగానే తన ఆదరణ కనబరుస్తోంది. అదే విధంగా భర్తను కోల్పోయి ముగ్గురు పిల్లలతో దయనీయ స్థితిలో ఉన్న మండలంలోని గొండ్యాలపుట్టుగకు చెందిన బైరెడ్ల మోహినికి అండగా నిలిచింది. మంగళవారం గ్రామానికి చేరుకున్న సభ్యులు మోహినితో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం తమ వంతుగా రూ.20,500లు అందించారు. రమేష్ కుటుంబ సభ్యుల దయనీయ స్థితి వివరిస్తూ 'ప్రజాశక్తి' 'మావయ్య.. నాన్నేరి..' అంటూ వార్త ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే.

శంకర్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బెల్లుపడాకు చెందిన కొండ శంకర్‌రెడ్డి ఇటీవల రెడ్డిక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితుల య్యారు. ఈ మేరకు గ్రామస్తులు మంగళవారం ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు సాగునీరు, తదితర సమస్యలపై శంకర్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ బోధన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక సదుపాయాలు, ఉత్తమ బోధన ఉంటుందని ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని అన్నారు. నీట్, ట్రిపుల్‌ఐటి తదితర పోటీల పరీక్షలకు మెటీరియల్స్ అందిస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణ, అనుభవం ఉన్న అధ్యాపకులతో బోధన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శరత్‌బాబు

విజయలక్ష్మి, అధ్యాపకులు నల్లాన రమేష్, బోరుభద్ర సురేష్ కుమార్, పైడి సురేష్ కుమార్, హెణ్నీ ప్రధాన్, రవిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



పెట్టెలను పంపిణీ చేస్తున్న శైలజ

తేనెటీగల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- రణస్థలం

తేనెటీగల పెంపకం ద్వారా రైతులకు తమ పంటల దిగుబడి పెంపొందించుకోవచ్చని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంటమాలజీ హైదరాబాద్ సిద్దిపేట వి.శైలజ అన్నారు. పైడిభీమవరం మహి గ్రాండ్‌లో తేనెటీగలపై మంగళవారం నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తేనెటీగల పరాగ సంపర్కం వల్ల అధిక దిగుబడి సాధ్యమన్నారు. తేనెటీగలే లేకపోతే మానవ మనుగడ లేదని అన్నారు. పంట దిగుబడులకు తేనెటీగలు ప్రధాన పాత్ర పోషిస్తాయని అన్నారు. తేనెటీగల పూలలోని మకరందాన్ని సేకరించి తేనెగా మార్చి పరాగ సంపర్కానికి సహాయపడతాయని అన్నారు. పంట దిగుబడులు తగ్గిపోవడానికి ప్రధాన కారణం తేనెటీగలు లేకపోవడమేని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు అన్నారు. అనంతరం పెట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసోసియేట్ బయో డైవర్సిటీ వి. అరుణ, అసిస్టెంట్ మేనేజర్ వై.లహరి, ఆగ్రో ఫారెస్ట్రీ ఏరియా మేనేజర్ నరసింహమూర్తి, దేవుడుబాబు, తవిటినాయుడు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలోని ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పనులపై మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ అధ్యక్షులు సలాం మోహనరావు మాట్లాడుతూ సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతను విశదీకరిస్తూ మాట్లాడారు. ఉపాధి హామీ పనులు గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందన్నారు. ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా, ఎపిఒ రవి, మండల టిడిపి అధ్యక్షులు నంబాల వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహనరావు

ఆదిత్యుని హుండీ ఆదాయం రూ.55.11 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని బంగళవారం లెక్కలించారు. ఈ లెక్కింపులో 40 రోజులకు గాను రూ.55, 11,915 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ తెలిపారు. కరెన్సీ నోట్ల ద్వారా రూ.50,51,52, చిల్లర నాణేలు ద్వారా రూ.4,60,863 ఆదాయం వచ్చిందన్నారు. బంగారం 45 గ్రాములు, వెండి 992 గ్రాములు వచ్చిందనానరు. కార్యక్రమంలో రావివలస యండల మల్లిఖార్జున స్వామి ఆలయం ఇఒ జి.గురునాథరావు, శ్రీకాకుళం ఇఒ పి.శ్యామలరావు, కోటేశ్వరస్వామి ఆలయం ఇఒ సుకన్య, ఆలయ ప్రధాన అర్చకులు శంకరశర్మ, ఆలయ సిబ్బంది, సేవా దళ్ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగుతో అవస్థలు

బూర్జ: మండలంలోని మామిడివలసలో మురుగునీరు రోడ్డుపైకి వస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కాలువలు లేకపోవడంతో గ్రామస్తులు వాడి నీరంతా రహదారిపైన నిల్వ ఊడిపోతుంది. వేసవిలోనూ రహదారిపై మురుగునీరు నిల్వ ఉంటుంది. దీనివల్ల రాత్రివేళలో కాకుండా పగలు కూడా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రహదారిపై కనీసం నడవలేని పరిస్థితి దాపురించింది. ఈ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించిన సందర్భాలు ఉన్నాయి. అయినా



నిల్వ ఉన్న మురుగునీరు

సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మురుగునీరు రహదారిపైకి రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థిక సాధికారతకు మహిళల ముందడుగు



అవగాహన కల్పిస్తున్న ఎపిఎం కూర్మారావు


ప్రజాశక్తి- మందస

వికసిత గ్రామీణ భారత్ దిశగా సమ్మిళిత వృద్ధికి, ఆర్థిక సాధికారతకు మహిళలే ముందడుగు వేస్తూ, గ్రామాల్లో మహిళా సంఘాలకు జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా క్రియాశీల అవగాహన కల్పించాలని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు పిలుపునిచ్చారు. మందస సచివాలయ ఆవరణలో జండర్ ర్యాలీ మంగళవారం చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు రమణమ్మ, శారద సైలజ, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

మండల స్థాయి గ్రిగ్స్ పోటీల్లో సత్తా చాటి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన పెద్దకర్రివానిపాలెం విద్యార్థులకు స్థానికులు అభినందించారు. కబడ్డీ సీనియర్ బాలికల విభాగంలో పెద్దకర్రివాణిపాలెం జడ్‌పిహెచ్‌ఎస్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ విజయం ద్వారా వారు నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత పొందారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మురళీప్రకాష్, ఎస్ఎంసి



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సభ్యులు, ఉపాధ్యాయులు పాపారావు, కుముదకరరావు, రామచంద్రరావు, రామకృష్ణ, మురళీధర్, రామారావు, దుర్యోధన, కె.లింగరాజు, డి.లింగరాజు, ధర్మారావు, గాయత్రి అభినందించారు.

ఉపాధ్యాయులపై నిందలు తగవు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఎనిమిదేళ్లుగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి కారణమైన ఉపాధ్యాయులపై నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని పిఎంసి మాజీ చైర్మన్ తమ్మినైన ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 2022-24 మధ్యన తాను చైర్మన్‌గా ఉన్నానని, ఆ సమయంలో పాఠశాలకు ఆయన చేసిన కృషి తల్లిదండ్రులకు, విద్యార్థులకు తెలుసని అన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా 62 మంది విద్యార్థులకు సైకిళ్లు, 15 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సర్పంచ్ చేతులు మీదుగానే పంపిణీ చేసిన విషయం గుర్తుకు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ అధికారులు తొలగించగా, వాటిని ఎవరు అమ్ముకుని, ఆ డబ్బులను తీసుకున్నారో విచారణ చేపడితే తెలుస్తుందని అన్నారు. పాఠశాల విధులకు ఆటంకం కలిగిస్తుండడంపై సమగ్ర విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన కోరారు.

జాతీయ పోటీలకు అభిషేక్ ఎంపిక

టెక్కలి : పంజాబ్ రాష్ట్రం లుధియానాలో ఈ నెల 12 నుంచి నిర్వహించనున్న గట్కా జాతీయస్థాయి పోటీలకు తమ శిక్షణా సంస్థకు చెందిన పడాల అబిషేక్ ఎంపికైనట్టు కోచ్ నర్సిపురం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమస్థానం సంపాదించుకుని జాతీయస్థాకి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.



ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

సతీష్ ప్రయోగానికి పేటెంట్

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనిక విభాగం అధిపతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ రూపొందించిన ప్రయోగానికి పేటెంట్ హక్కులను సంబంధిత విభాగం నుంచి పొందినట్లు తెలిపారు. సతీష్‌కుమార్ మెషిన్ లెర్నింగ్ ఎనేబుల్డ్ ఐఒటి అనే పరికరాన్ని కనుగొన్నారు. 6జి నెట్‌వర్క్ ఆధారంతో పాటు స్మార్ట్‌సిటీల్లో సుస్థిరమైన ఎలక్ట్రిక్ వాహన పర్యావరణ వ్యవస్థ, గాలి నాణ్యత పర్యవేక్షణ అనే దానిపై పరిశోధన చేశారు. ఇందుకు సంబంధించి పేటెంట్ హక్కులను పొందినట్లు తెలిపారు. సతీష్‌కుమార్‌ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిదమ్మ, జాతీయ సేవా విభాగం పిఒలు కందిగొళ్ల, పూక్‌పాల్, డి.వాసుబాబు, అధ్యాపకులు ఝాన్సీరాణి, తదితరులు అభినందించారు.



ప్రారంభిస్తున్న బాలాజీ

నూతన కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ట్రిపుల్ ఐటిలో కొత్తగా మైనర్ డిగ్రీ కోర్సులు ప్రారంభమయ్యాయి. కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటధన బాలాజీ, పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం నియమ నిబంధనలు ప్రకారం 20 క్రెడిట్ కోర్సు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, మ్యూజిక్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి- నరసన్నపేట

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, నీటి, వాయు కాలుష్య నివారణకు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత పిలుపునిచ్చారు. డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం కాలుష్య నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కాలుష్య నియంత్రణ ప్రాధాన్యత వివరించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవిద్య, గిరిష్, ఢిల్లీశ్వరరావు, త్రినాథరావు, నాగరాజు, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న రాజేష్

రాజేష్ పరామర్శ

ప్రజాశక్తి- కవిటి

జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ మంగళవారం ఉదయం పలువురిని పరామర్శించారు. మండలంలోని బెజ్జిపుట్టుగలో బార్ల హైమావతి ఇటీవల మృతి చెందారు. అదే సమయంలో కవిటి కాలనీలో పొల్లాయి శ్యాం కూడా మరణించారు. విషయం తెలుసుకున్న రాజేష్ మంగళవారం వారం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.